# యాక్సిడెంట్

బస్సు బయలుదేరటానికి ఆలశ్యమున్నట్లుంది.

డ్రైవరు కింద నిల్చొని ఎవరితోనో బాతాఖాని వేసుకున్నాడు.

కండక్టరు లోపల టికెట్లు కొడుతున్నాడు.

ఫ్రంట్ సీట్లో కూర్చొని విండోలోంచి వచ్చే పోయే మనుషుల్ని గమనిస్తున్నాను. ఇంతలో నా పక్క సీట్లో ఒక శాల్తీ కూలబడింది. అవతల సీటు వారికి యిబ్బంది కలుగుతుందనే ఇంగిత జ్ఞానం లేకుండా - బియ్యం బస్తాను కుదేసినట్లు - సదరు మనిషి తనది కాదన్నట్లు స్థూలకాయాన్ని సీట్లో పడేశాడు. బస్సు గోడకు - ఆ కాయానికి మధ్య యిరుక్కుపోయాను.

కొంచెం కోపంగా చూశాను. ఇప్పుడొచ్చి నాకున్న జాగాను ఆక్రమించాడన్న కోపాన్ని అణుచుకుంటూ కొంచెం సర్దుకునే ప్రయత్నంలో అతడ్ని పక్కకు నెట్టాను. ఊహు! పిసరంత కూడా కదల్లేదు శాల్తీ.

"హీ హీ" గారపళ్ళుతో ఓ వెకిలి నవ్వు విసిరాడు.

"మీరు కొంచెం లేచి కూర్చుంటే నా చొక్కా సరిచేసుకుంటాను." నా యిస్త్రీ చొక్కా అతని కింద నలిగిపోతున్నది.

"సారీ-" అతను లేచి- కొంచెం పక్కకు జరిగాడు.

ఓ మాదిరిగా గాలి ఆడింది.

కండక్టర్ బెల్ కొట్టాడు. ప్రయాణీకులు తమను సాగపంపడానికి వచ్చిన వారి దగ్గర వీడ్కోలు తీసుకుంటూ బస్సు ఎక్కసాగారు.

ఫ్రంట్ సీట్ దొరికినందుకు నాలోనే సంతోషించుకుంటూ ఉన్న వాణ్ని పక్క శాల్తీతో డీలా పడిపోయాను.

రాత్రి పూట ప్రయాణం! బస్సు హెడ్‌లైట్ల వెల్తురులో మెరిసేరోడ్డును, రోడ్డు మీంచి పక్కకు జరిగిపోయే జీవాలను చూస్తూ ప్రయాణిస్తూ ఉండే నాకదో థ్రిల్! అందుకే ముందుగా రిజర్వు చేయించుకున్నాను.

ఇంకా ముందున్న సింగిల్ సీట్ కండక్టర్‌తో బేరమాడి కొట్టేద్దామని ఆలోచిస్తున్నాను.

బస్సు బయలుదేరబోతూ ఉన్నది.

ఇంతలో ఓ ఘరానా పెద్దమనిషి మా సీటుదగ్గరికి వచ్చాడు. అటూ యిటూ చూస్తున్నాడు. సీట్లు అయిపోయినట్లున్నాయి. అందుకే నిల్చున్నాడు అనుకున్నాను.

"ఇది నా సీటు!" పెద్ద మనిషి నా పక్కనున్న సదరు బియ్యం బస్తాలాంటి శాల్తీతో అన్నాడు.

"ఇందాక రుమాలు వేశాను."

"ఓహో! రుమాలు రిజర్వేషనా!"

"అవును - రుమాలు వేసి - కాఫీ తాగి వద్దామని కిందకు వెళ్ళాను - ఇంతలో-"

"నాకటువంటి రుమాలేమీ కనపళ్ళేదే! కండక్టర్ అన్ రిజర్వ్‌డ్ సీటు అని చెబితే కూర్చున్నాను." నిర్లక్షంగా జవాబిచ్చాడు.

"ఉండచ్చు - కాని అంతకుముందే నేను కూర్చున్నాను." కోపంగా అన్నాడు పెద్ద మనిషి.

డ్రైవర్ బస్సు ఆపాడు. ఏమైంది అని అడిగాడు. వాళ్ళిద్దరూ తమకు తోచిందేదో చెబుతున్నారు.

కానిపనికి, కానీరానిపనికి తల దూర్చడమంటే నాకు చిరాకు. మెదలకుండా కూర్చున్నాను.

కండక్టర్ వచ్చాడు.

"మీ నెంబరు ఎంత?" చెప్పాను. చెక్ చేసి తలూపాడు - బస్తాశాస్త్రీని అడిగాడు.

"నువ్వేగదయ్యా ఇక్కడ కూర్చోమంది?" దబాయింపుగా అన్నాడు.

కండక్టరు శాస్త్రీ బరువును చూసి జంకాడు.

"అవుననుకోండి - కానీ ఎవరైనా లేకపోతే అనికదా నేను చెప్పింది. చూసి కూర్చునుండాల్సింది."

"చాల్లే వయ్యా - చెప్పొచ్చావ్ - ఎవరైనాకూర్చుంటే నేనెందుకు కూర్చుంటాను?" కోపంగా ఎగిరాడు.

కండక్టర్ బిక్కచచ్చిపోయాడు.

పెద్దమనిషికి కూడా కోపం ఎక్కువైంది.

"ఏంటయ్యా - నీ దబాయింపు? రుమాలేసుంటే - కూర్చుని - మళ్ళీ మాట్లాడతావే?"

"రుమాలా ? అసలు వేశారా? "

"ఈ మాత్రం దానికి అబద్ధం కూడా చెబుతానా?"

"ఏమోమరి? మీకే తెలియాలి."

"అసలు నా రుమాలేమైంది?"

"నన్నడిగితే! నేనేమైనా రుమాళ్ళ దొంగలా కనిపిస్తున్నానా నీకంటికి?"

"మరేమనుకోవాలి? కిందకు దిగేప్పుడు వేసిన రుమాలు లేదు? కొత్త రుమాలు. ఐదు రూపాయలు పెట్టి కొన్నాను. పసుపుపచ్చటి శిల్కురుమాలు వచ్చేసరికి మాయమై రుమాలుకు బదులు ఈయనున్నారు."

"అంటే - అంటే నేనే నీ రుమాలంటావా?"

"నీపక్కనున్నాయనన్ను అడుగు - మాష్టారు - మీరుకూర్చునేసరికి ఉందా? నేను వెళుతున్నప్పుడు వచ్చినట్లున్నారు? నిజం చెప్పండి ప్లీజ్!" పెద్దమనిషి నన్ను దింపడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మీరైనా చెప్పండి - నేను వచ్చినప్పుడు రుమాలుందా? నేనంత జ్ఞానం లేని పశువునా, ఎవడైనా రుమాలేస్తే దాన్ని తీసికూర్చోడానికి?"

ఇరకాటంలో పడ్డాను - ముందు గొయ్యి - వెనుక నుయ్యి.

ప్యాసెంజర్లలో విసుగు ప్రారంభమయింది. రకరకాల కామెంట్లు బయలు దేరాయి.

"ఏందయ్యా ఈగోల-"

"అసలే బస్సు ఆలశ్యం - దీనికి తోడు ఇదోగోల."

"సీట్లకోసం ఏమిటి సిల్లీగా-"

"యివేమన్నా పార్టీసీట్లా? కొట్టుకోడానికి?"

"సీట్లకోసం సిగపట్లేమిటి?"

"చూడ్డానికి నీటుగా డ్రస్సులు వేస్తారు, బుద్ధులు చూస్తే - ఛీ!"

"ఏమిటి - యింక ఈ బస్సు కదలదా?"

"ఓ కండక్టరు - ఓపని చెయ్యి - ఇద్దర్నీ కింద దించెయ్యి!"

"అయ్యా! డ్రైవరు ఇవ్వాళ వెళ్ళుద్దా?"

"అయ్యబాబోయ్ - నాకవతల బోలెడు అర్జెంటు పన్లున్నాయ్ - మీకు దండమెడతాను- అయ్యా - నా మొహం జూసన్నా సర్దుకోండయ్యా...."

వాళ్ళు గుచ్చి గుచ్చి చూడ్డంతో కోమటి సాక్ష్యం చెప్పకతప్పలేదు.

"ఆఁ మీరు వెళ్ళేప్పుడు వేసినట్లున్నారు. అవును....... మీరు వచ్చినప్పుడు లేనట్టుంది. మరి....నిద్రపట్టింది....ఏమైందో చూడలేదు."

వీడు లాభం లేదనుకున్నారు,కాబోలు,వాళ్ళిద్దరరూ కండక్టర్ మీద 'గయ్' మన్నారు. అసలే ఒంటి ఊపిరి కండక్టర్! గాలివానలో ఒంటి ఆకులా ఊగిపోతున్నాడు.

"సార్! చివర్న ఓ సీటుంది- దాంలో పోయి కూర్చోండి". పెద్ద మనిషికి చెప్పాడు.

"సార్ - మీరన్నా కొంచెం..." కండక్టర్ నసిగాడు.

"నో - నాకేం ఖర్మ - నేనిక్కడే కూర్చుంటాను."

"కండక్టర్! నా ఆరోగ్యం అసలే మంచిది కాదు వెనకాలసీట్లో కూర్చుంటే ఆ కుదుపులకు నాకు యింకా చెడిపోతుంది."

ఇలా జరిగేదేమో! ఇంకా చాలాసేపు!

నేను చటుక్కున నా సీట్లోంచి లేచి నిలబడ్డాను- ఆ పెద్దమనిషి వంక చూసి అన్నాను.

"ఆల్‌రైట్! మీరు నా సీట్లో కూచ్చోండి- నేను ఆ చివరసీట్లో పోయి కూర్చుంటాను."

ఆ పెద్ద మనిషి నమ్మలేనట్లు ముందు చూసి - గమ్మున కూర్చున్నాడు- ఎక్కడ ఆ శాల్తీ అటు, విండో వైపుకు, జరుగుతుందేమోనన్న భయం కొద్దీ.

"థాంక్స్!" కోరస్!

నా జీవితంలో మర్చిపోలేని క్షణం! కండక్టర్ కాదు-తోటి ప్రయాణీకులంతా కళ్ళతోనే అభినందించారు. టికెట్టు కొనని వాళ్ళు కొందరు యింక ఆ బస్సు అవ్వాళ్టికి పోదని నిశ్చయించుకుని వేరే బస్సెక్కి సగం దూరం వెళ్ళిపోయారు కూడ.

అస్సాం, పంజాబు సమస్యలలాగా ఆ చిక్కుముడిని యిట్టే విప్పినందుకు చాలామంది అభినందించారు.

గర్వంతో వెళ్ళి చివరిసీట్లో కూర్చున్నాను. అది నేను ఎల్లప్పుడూ ద్వేషించే సీటు అని కాసేపు మర్చిపోయి.

బస్సు బయలుదేరింది.

ఆలశ్యాన్ని కవరుచేయాలని అనుకున్నాడు కామోసు, డ్రైవరు బస్సును విమానంలా నడుపుతున్నాడు.

టైరు గుంటలో పడినప్పుడు అల్లంతెత్తు ఎగిరి నాతల టాపును ముద్దెట్టుకుంటోంది.

చల్లగాలికి అలానే మత్తులో ఒరిగి పోయాను - ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది.

హాహాకారాలు వినిపిస్తున్నాయి.

నేనెవరి మీదో పడి ఉన్నాను.

కళ్ళు విప్పి పరికించి చూశాను. బస్సు ఒక పక్కకు ఒరిగిపోయి ఉంది.

బస్సు లారీకి ఢీ కొన్నట్టుంది. ఢీ కొట్టి పక్కనే ఉన్న బురదగుంటలోకి వాలిపోయింది. ఎమర్జెన్సి గేటు నుండి ఒక్కొక్కళ్ళు బయటపడుతున్నారు.

నేను కూడ హడావిడిగా బ్యాగ్ అందుకుని బయటకు దూకాను.

నా గుండె అదురుడు తగ్గడానికి కొన్ని నిముషాలు పట్టింది.

బస్సు ముందువైపుకు పోయి ప్రయాణీకుల తలల మీదుగా చూశాను.

ఘోరం!

ఫ్రంట్ పోర్షన్ తుక్కు తుక్కు అయిపోయింది! లారీ - ముందు భాగం - బస్సు ముందు భాగానికి బలంగా కొట్టుకుంది.

అన్నట్టు ఫ్రంట్ సీట్!

పెద్దమనిషి నెత్తురు మడుగులో ఉన్నాడు.

ఒక్క క్షణం నా గుండె ఝల్లుమంది. ఆ స్థానంలో నే ఉండాల్సింది. మొహం చెమటలు పోసింది అంత చలిలో కూడ!.

రుమాలు తీసి మొహం తుడుచుకున్నాను-అరే! పసుపుపచ్చ సిల్కు రుమాలు! ★

(ఆదివారం ఆంధ్ర పత్రిక)

